కరెంటు కోతలపై రైతన్న కన్నెర్ర

కరెంట్ కోతలను నిరసిస్తూ మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని విద్యుత్తు సబ్ స్టేషన్ ఎదుట ఖత్‌గాం గ్రామ రైతులు బైఠాయించారు. దీంతో అర కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. – భైంసా

తాగునీటి కోసం ట్యాంక్ ఎక్కి..

మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడీ తండా(బీ) పరిధిలోని చిన్న తండాకు చెందిన అజ్మీరా రవినాయక్ మంగళవారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. – ధర్మారం

జీతాలివ్వండి మహా ప్రభో

కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో సుమారు 60 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. – కరీంనగర్ విద్యానగర్

నియామకాల్లో అవరోహణమే ముద్దు

గురుకుల ఉపాధ్యాయుల నియామకాల్లో 'అవరోహణ క్రమం' పాటించాలని కోరుతూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిరుద్యోగ జేఏసీ, తెలంగాణ అన్ ఎంప్లాయిస్ అండ్ ప్రైవేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నేతలు ధర్నా చేశారు. – కవాడిగూడ

గరిడేపల్లి మండలం కల్మల్‌చెర్వు గ్రామంలో ఎండిన పంట పొలంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

గరిడేపల్లి మండలం కల్మల్‌చెర్వు గ్రామంలో ఎండుతున్న పొలాన్ని చూపిస్తున్న రైతు

నీళ్లు ఉత్తమ్‌చ్చుటే!

మొదటిపేజీ తరువాయి...

కొత్తగా బావులు తవ్వుకుంటూ, బోర్లు వేస్తూ పంటలు పండించేందుకు తమ సర్వశక్తులూ ధారపోస్తున్నారు. ఈ సీజన్‌లో సుమారు 85 వేల ఎకరాల్లో వరి సాగైనట్టు అంచనా. ప్రారంభంలో బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రస్తుతం అడుగంటి పోతున్నాయి. గతంలో పంటల చివరి దశలో ఇలాంటి పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మానవీయంగా స్పందించి, నీళ్లను విడుదల చేసింది. రైతులను ఆదుకున్నది. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిష్క్రియాపరత్వం ప్రదర్శిస్తుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాక్షాత్తు నీటి పారుదలశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10 వేల ఎకరాల్లో ఎండిన పంటలు

గత రెండువారాలుగా ఎండ తీవ్రత పెరుగుతుండటం, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిపోతుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దాంతో బోర్లు, బావుల కింద సాగుచేసిన వరి పంటకు నీళ్లు అందడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే 10 వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయే దశకు చేరుకున్నట్టు సమాచారం. పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో మరో 10 వేల ఎకరాలపై ఎఫెక్ట్ పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి, నీటిని విడుదల చేసి పొట్ట దశలో ఉన్న పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు. తక్షణమే ఒక విడత, పక్షం రోజుల్లో మరో విడత నీటిని విడుదల చేస్తే యాసంగి పంట గట్టెక్కుతుందని భావిస్తున్నారు. మంగళవారం గరిడేపల్లి మండలం కల్మలచెర్వుకు చెందిన రైతులు ఎండిన వరి పొలంలో ఆందోళనకు దిగారు. చేతిలో పురుగుమందు డబ్బాలు పట్టుకుని నీటిని విడుదల చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు.

మూడెకరాలు ఎండిపోయింది

వ్యవసాయం చేయడం తప్ప నాకు ఏమీ తెలీదు. పొలం కౌలుకు తీసుకుని వరి నాటిన. పంట పూర్తిగా ఈని, అర్రు వంగిన దశలో నీరు లేకపోవడంతో మూడెకరాలు పూర్తిగా ఎండిపోయింది. ఒక్క పదిరోజులు పొలం పారి ఉంటే పంట చేతికొచ్చేది. మరో పది రోజుల్లో నీరు ఇవ్వకపోతే చాలామంది రైతులకు నాలాంటి పరిస్థితే వస్తుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగర్ నీటిని విడుదల చేయించి రైతులకు అండగా నిలబడాలి.

– బెడదల రంగారెడ్డి, రైతు, కల్మల్‌చెర్వు, గరిడేపల్లి మండలం

సాగర్ నీటిని విడుదల చేయాలి

రాత్రనక, పగలనక పొలం దగ్గరే ఉంటూ పసిపాప లెక్క పంటను కాపాడుకుంటూ వచ్చినం. పొలాలు ఇప్పుడిప్పుడే అర్రు వంగుతున్నయ్. మరో రెండు తడులు పారిస్తే వడ్లు పండుతయ్. ఇప్పుడు బోర్లు, బావుల్లో నీరు ఊరుత లేదు. చాలా పొలాలు ఎండిపోయినయ్. మిగిలిన పొలాలు కూడా చేతికందడం అనుమానమే.. నాగార్జునాసగర్‌లో నీళ్లున్నయి కాబట్టి ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకుని వారం, పది రోజుల పాటు నీటిని విడుదల చేస్తే గట్టెక్కుతాం.

– గుజ్జుల శంభిరెడ్డి, రైతు కొండాయి గూడెం, గరిడేపల్లి మండలం

సాగర్ నీటిమట్టం 518 అడుగులు

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 518 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది. డెడ్ స్టోరేజీ లెవల్ 510 అడుగులు కాగా రానున్న వేసవిలో రెండు తెలుగు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని వినియోగించనున్నారు. గతంలో కూడా డెడ్ స్టోరేజీ లెవల్ లోనూ చివరి దశలో ఉన్న పంటలను కాపాడేందుకు సాగునీటిని విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటిమాదిరిగానే 2015లో కూడా నాగార్జునసాగర్‌కు వరద రాకపోతే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఉన్న నీటినే పంటల కోసం విడుదల చేసి రైతులను ఆదుకున్నది. ఆ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో సాగర్‌లో 508 అడుగుల నీరు మాత్రమే ఉన్నప్పటికీ, యాసంగి వరి పంటను కాపాడేందుకు రెండు వారాలపాటు సాగునీటిని విడుదల చేసింది. అప్పటి కంటే ప్రస్తుతం 10 అడుగుల నీరు అదనంగానే ఉన్నదని, సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని, నీళ్లు ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం

- కల్మల్‌చెర్వు గ్రామానికి చెందిన బెడదల రంగారెడ్డి అనే కౌలు రైతు చెవ్వారిగూడెం గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి దగ్గర మూడెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. బోరు, బావిపై ఆధారపడి వరి సాగు చేశాడు. వరి పంట పొట్ట దశలో ఉండగా పూర్తిగా ఎండిపోయింది.
- అదే గ్రామానికి చెందిన యడవెల్లి కోటిరెడ్డి అనే కౌలు రైతు గుండెబోయినగూడెంకు చెందిన శ్రీనివాసరెడ్డికి చెందిన ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాడు. ఎకరాకకు పది బస్తాల చొప్పున కౌలు మాట్లాడుకున్నారు. గ్రామ సమీపంలోని వాగుకు వేసిన లిఫ్ట్‌పై ఆధారపడి సాగు చేశాడు. ఇప్పుడు వాగు కూడా అడుగంటింది. దీంతో నీళ్లు అందక వరి పొలం నెర్రెలు బారింది. ఈనెలు బారే దశలో ఉన్న వరి మొక్కలు నేలకు వాలాయి.
- పాలకవీడు మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన బోగాల సైదిరెడ్డి అనే కౌలురైతు అదే గ్రామానికి చెందిన ఏ సైదయ్య నుంచి మూడెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. రెండు బావులపై ఆధారపడి సాగు చేశాడు. బావుల్లో నీరు ఊరక మూడెకరాల పొలం మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. ఇలా కౌలు రైతులు పెట్టుబడులు వెళ్లక, కౌలు ఎలా చెల్లించాలో తెలియని పరిస్థితి నెలకొన్నది.మరికొద్ది రోజులు పంటను కాపాడుకుంటే చేతికందుతుందనే ఉద్దేశంతో రైతులు నీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. అవకాశం ఉన్నచోట ఈ స్థితిలో కూడా కొత్తగా బోర్లు వేయిస్తున్నారు.

ఉత్తమ్.. పొలం ఎండిపోతున్నదయ్యా..

- హుజూర్‌నగర్ నియోజకవర్గం కల్మల్ చెర్వు గ్రామానికి చెందిన రైతు మూల గుండ్ల చిన్న వీరారెడ్డికి మూడు ఎకరాల పొలం ఉన్నది. ఆ పొలం మధ్య నుంచే నాగార్జునసాగర్ కాల్వ వెళ్తుంది. గత పదేండ్లుగా ఎటువంటి ఇబ్బంది లేకుండా వరి సాగు చేసుకుంటున్నాడు. ఈ వానకాలం సీజన్‌లో సాగర్ నీరు రాకపోయినప్పటికీ మూడెకరాల్లో వరి పండించాడు. ఈ సీజన్‌లో సైతం బోరుపై ఆధారపడి వరి నాటు పెట్టాడు. పంట బాగా పెరిగి ఈనుతుండటంతో ఇబ్బంది లేదనుకున్నాడు. పంట పూర్తిగా ఈని, అర్రు వంగుతున్న సమయంలో బోరు పట్టిపోయింది. మరో పది రోజులు ఆగితే పంట ఇంటికొచ్చేది. కానీ, ఇప్పుడు నీరు లేక ఎండిపోయింది.
- గరిడేపల్లి మండలం పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొల్లగాని వెంకన్నకు గానుగుబండకు వెళ్లే దారిలో రెండున్నర ఎకరాల భూమి ఉన్నది. ఒక బోరు, ఒక బావిపై ఆధారపడి వరి పంట వేశాడు. పొట్టదశలో ఉండగా బోరు, బావుల్లోని నీరు ఇంకిపోవడంతో పైరు ఎండిపోయింది.
- పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామంలో షేక్ ఖాసిమ్ అనే రైతు రెండు బోర్లు కింద నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. అవి అడుగంటి పోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది.
- మేళ్లచెరువు మండలం హేమ్లాతండా పంచాయతీ పరిధిలోని సాధుతండాకు చెందిన రైతు ధరావత్ సైదా తన పొలంలోని బోరు ఎండిపోవడంతో ఎకరం విస్తీర్ణంలో పొలం వదిలేయాల్సి వచ్చింది. ఇలా దాదాపు పది వేల ఎకరాల్లో వరి పంట ప్రస్తుతం ఎండిపోతున్నది. దీంతో చేసేదేమీలేక పలువురు రైతులు ఇప్పటికే ఎండిన పొలాల్లో పశువులను మేపుతున్న దయనీయ దృశ్యాలు కనిపిస్తున్నాయి.

జగజ్యోతి నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

జగజ్యోతి నగధగలు

మొదటిపేజీ తరువాయి...

ఆభరణాలు.. ఇలా మూడున్నర కిలోల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజనభవన్‌లో రూ.84 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన జగజ్యోతి ఇంట్లో సోమ, మంగళవారాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ సమీపంలో వెంకటసాయి అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టగా సుమారు రూ.65.50 లక్షల నగదు, రూ.1.51 కోట్ల విలువైన 3.6 కిలోల బంగారు ఆభరణాలు, ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లకు సంబంధించిన ఆస్తిపత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఆమె దగ్గరున్న మొత్తం ఆస్తుల విలువ రూ.15 కోట్లకు పైగానే ఉంటుందని పేర్కొన్నారు.

గుండెనొప్పంటూ హైడ్రామా..

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడ మండలం తాటివర్రుకు చెందిన జగజ్యోతి ఉద్యోగరీత్యా మెహిదీపట్నంలో ఉంటున్నది. ఆమె భర్తది నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు. ఏసీబీ అధికారులు తనని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం మొదలూ.. నానా హంగామా సృష్టించింది. ఏసీబీ అధికారులు ఆమెను రిమాండ్‌కు తరలించేందుకు సిద్ధమవుతుండగా ఛాతీనొప్పంటూ నాటకమాడింది. హుటాహుటిన ఆమెను ఉస్మానియా దవాఖానకు తరలించి అన్ని పరీక్షలు చేయించారు. అన్ని పరీక్షల్లో నార్మల్‌గా రిపోర్టు రావడంతో కోర్టుకు తరలించే ప్రయత్నం చేశారు. మళ్లీ కాసేపటికే గుండెనొప్పి అంటూ చెప్పడంతో మళ్లీ ఆమెను దవాఖానకు తరలించి గుండె పరీక్షలు నిర్వహించారు. అవి కూడా నార్మల్ అని తేలడం, మొత్తానికి ఆమె నాటకమంతా బయటపడటంతో అరెస్టుకు ఏసీబీ అధికారులు రంగం సిద్ధం చేశారు. బుధవారం జగజ్యోతిని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించనున్నారు.

కాంగ్రెస్ గూండాగిరి

మొదటిపేజీ తరువాయి...

గాయపడిన ఇద్దరు యువకుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మేడిపల్లి రవీందర్ ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. రామన్నపల్లి శివారు సర్వే నంబర్ 422లో ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ భూమిని గతంలో కొందరు కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టారు. స్థలాలను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. సర్వే నంబర్ 422 పక్కనే.. పట్టా భూమి సర్వే నంబర్ 407 కూడా ఉన్నది. దీన్ని సాకుగా చూపి ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. ఇదే స్థలాన్ని కబ్జా చేసిన కౌన్సిలర్ రవీందర్.. అందులో అక్రమంగా ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ అక్రమాలపై స్థానిక యువకులు కొలకాని రాజు, మర్రి మల్ల య్య (మల్లికార్జున్), మేడిపల్లి రమేశ్ తదితరులు జిల్లా కలెక్టర్, తహసీల్దార్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేసిన మున్సిపల్ అధికారులు కొంతభాగం ప్రభుత్వ స్థలమని నివేదిక ఇచ్చారు. అయితే.. అధికారులెవరూ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోకపోవడంతో మంగళవారం రవీందర్ సదరు స్థలంలో బోరు వేయించేందుకు సిద్ధమయ్యాడు. దీంతో యువకులు అధికారులకు సమాచారమిచ్చారు. అయినా..అధికారులు స్పందించలేదు. దీంతో రెచ్చిపోయిన కౌన్సిలర్.. యువకులను దుర్భాషలాడుతూ ఇనుప రాడ్డుతో రాజు, మల్లయ్య, రమేశ్‌పై దాడిచేశాడు. రాజు, మల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు వారిని పట్టణంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నదని సమాచారం. దాడి గురించి తెలుసుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

కబ్జాను అడ్డుకునేందుకు వచ్చిన యువకుడిని ఇనుప రాడ్‌తో కొడుతున్న కౌన్సిలర్ రవీందర్

స్థానికులపై ఇనుప రాడ్‌తో దాడి చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ రవీందర్

బాధితులతో మాట్లాడిన 'పొన్నం'

కౌన్సిలర్ దాడిలో గాయపడిన యువకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో మాట్లాడారు. దాడి చేసిన వ్యక్తులను క్షమించేది లేదని, దాడికి, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

భూకబ్జాను అడ్డుకున్న యువకులపై కాంగ్రెస్ కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ దాడి చేయడం హేయమని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. విషయం తెలుసుకుని జమ్మికుంటకు వచ్చిన ఎమ్మెల్యే బాధితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దాడులను ప్రోత్సహిస్తున్నదని, ఇలాంటి దాడులను సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అధికారులు ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్‌చేశారు.

ఎస్సారెస్పీ ఆయకట్టును కాపాడాలి

- కేటాయింపు కంటే ఎక్కువ నీటిని వదలొద్దు
- రైతుల ప్రయోజనాలు ముఖ్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

ఎస్సారెస్పీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 20: వరద కాలువకు కేటాయింపు కన్నా ఎక్కువగా నీరు వదలొద్దని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు డ్యామ్ వరకు గల ఆయకట్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలో పర్యటిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో ఉప్లూర్ వరద కాలువ వద్ద ప్రశాంత్‌రెడ్డి ఆగారు. దిగువకు నీరు వెళ్తుండటాన్ని గమనించిన ఆయన.. అక్కడి నుంచే ఎస్సారెస్పీ ఎస్ఈకి ఫోన్ చేశారు. ప్రాజెక్టులో నీటి స్టోరేజీ ఎంత ఉన్నది? ఈ సీజన్‌లో పంటల సాగుకు ఎన్ని టీఎంసీల నీరు అవసరమవుతుంది? అని అడిగి తెలుసుకున్నారు. కేటాయింపు కంటే ఎక్కువగా నీటిని దిగువకు వదలొద్దని సూచించారు. ఒకవేళ ప్రభుత్వం నీటి విడుదల విషయంలో ఏవైనా నిర్ణయాలు తీసుకున్నా ఎస్సారెస్పీ నుంచి ఎంఎండీ వరకు గల ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేటాయింపు కంటే ఎక్కువ నీటిని వదలొద్దని కోరారు. ప్రభుత్వం ఎక్కువగా నీటిని విడుదల చేయాలని నిర్ణయిస్తే తనకు చెప్పాలని, తాను ప్రభుత్వంతోపాటు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడతానని చెప్పారు. రైతుల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామని అన్నారు.

దళితబంధు కొనసాగించాలి: వంగపల్లి

మహేశ్వరాబాద్, ఫిబ్రవరి 20: దళితులను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలనే సంకల్పంతో కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని యథావిధిగా అమలుచేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మాదిగ మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టింపులకు వెళ్లకుండా దళిత బంధు పథకాన్ని అమలుచేయాలని కోరారు. ఎన్నికల ముందు ఎంపిక చేసినవారికి దళిత బంధు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధిక జనాభా కలిగిన మాదిగలకు రాజకీయంగా ఎక్కువ అవకాశాలు కల్పించాలని, మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీ ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో బ్యాంకులో రుణాలు

- కంపెనీల యజమానుల నిర్వాకం
- 2016లో అప్పటి ఆంధ్రాబ్యాంకులో 27 కోట్లు
- 12 మందిని రిమాండ్ చేసిన ఆర్సీపురం పోలీసులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 20: తప్పుడు పత్రాలు సమర్పించి బ్యాంకులో రుణాలు తీసుకున్న వ్యక్తులను సంగారెడ్డి జిల్లా ఆర్సీపురం పోలీసులు అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఆర్సీపురం ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. స్థానిక జ్యోతినగర్ వద్ద ఉన్న ఆంధ్రాబ్యాంకు ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో కొందరు వ్యక్తులు 2016లో వివిధ కంపెనీల పేరిట రుణాలు తీసుకున్నారు. బ్యాంక్‌కు సమర్పించిన పత్రాల్లో పలు లోపాలు ఉన్నా, అప్పటి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఫీల్డ్ అధికారి, వ్యాల్యూయేషన్ అధికారి, ఆడిటర్ అవేమి పట్టించుకోకుండా ఒక్కో కంపెనీకి రూ.1.80 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు రుణాలు మంజూరు చేశారు. రుణాలు తీసుకున్న వారు రెండేండ్లపాటు ఈఎంఐ చెల్లించారు. ఆ తర్వాత బ్యాంక్ మేనేజర్ మారడంతో తర్వాత వచ్చిన మేనేజర్ రుణాలను రెన్యువల్ చేయకపోవడంతో ఈఎంఐ చెల్లించడం ఆపేశారు. కంపెనీల పత్రాలు సరిగ్గా లేవని అధికారులు 2021లో గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పోలీసులకు ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్‌ని 2023లో సమర్పించడంతో దాని ప్రకారం రుణాలు తీసుకున్న యజమానులను, రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు మొత్తం 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డీపీహెచ్‌పై ఆరోపణ.. ఉద్యోగిని సస్పెన్షన్

- డిప్యూటేషన్ కోసం లంచం ఇచ్చినట్టు వైరల్ అయిన ఆడియో
- స్పందించిన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్
- తప్పుడు ఆరోపణలని ఖండన

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): డిప్యూటేషన్ కోసం నేరుగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్)కు లంచం ఇచ్చానంటూ ఆడియో వైరలైన ఘటనపై డీపీహెచ్ రవీందర్‌నాయక్ స్పందించారు. ఉన్నతాధికారులపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ఆరోపణ చేసిన ఉద్యోగినిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. తదుపరి విచారణకు ఆదేశించినట్టు వెల్లడించారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిప్యూటేషన్ కోసం డీపీహెచ్ రవీందర్‌నాయక్ కాళ్లు పట్టుకోవడంతోపాటు దాదాపు రూ.70 వేలు లంచం ఇచ్చానని, రిలీవింగ్ లెటర్ కోసం మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఇటీవల ఆడియో వైరలైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వైద్యశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'ఆరోగ్యశాఖకు లంచాల జబ్బు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం సైతం ప్రచురితమైంది.

నిబంధనలు పాటించారా?

మహిళా ఉద్యోగిని (హెల్త్ సూపర్‌వైజర్) సస్పెండ్ చేయడంపై వైద్యశాఖలో తీవ్ర చర్చ నడుస్తున్నది. ఆ ఉద్యోగినికి షోకాజ్ నోటీసు జారీ చేసి, వివరణ తీసుకున్న తర్వాత సస్పెన్షన్ ఉంటుందని వైద్యశాఖవర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో నిబంధనలు పాటించకుండా నేరుగా సస్పెండ్ చేశారనే ఆరోపణలున్నాయి. ఆడియోలో పేర్కొన్నట్టు లంచాల వ్యవహారం నిజమో కాదో ఎవరు తేల్చాలని ప్రశ్నిస్తున్నారు. జనవరి 2న తాను డీపీహెచ్ ఆఫీస్‌కు వెళ్లానని ఆమె చెప్తున్నారని, సీసీటీవీ ఫుటేజ్‌ను విడుదల చేస్తే బాగుంటుందని అంటున్నారు. మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్ అటెండర్, డీఎంహెచ్‌వో సహాయక సిబ్బంది బ్యాంకు లావాదేవీలు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

శామీర్‌పేటలో ల్యాబ్‌పై దాడులు

- రూ.5.5 లక్షల ఔషధాల సీజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో అక్రమంగా ఔషధాలు తయారుచేస్తున్న ఓ ప్రైవేట్ ల్యాబ్‌పై మంగళవారం డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.5.5 లక్షల విలువైన అక్రమ ఔషధాలను సీజ్ చేశారు. శామీర్‌పేటలో బయోటెక్ పార్క్‌లోని అస్పెన్ బయోఫార్మ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై 2023 మార్చిలో డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో 'గుడ్ మానిఫ్యాక్షరింగ్ ప్రాక్టీస్' (ఔషధ తయారీలో నాణ్యతకు సంబంధించి) నియమాలు పాటించకపోవడం, డ్రగ్ అండ్ కాస్మోటిక్ చట్టం నియమాలు పాటించడం లేదని తేలింది. ఇకపై ఎలాంటి ఔషధాలను ఉత్పత్తి చేయొద్దని, మందులపై ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించొద్దని డీసీఏ ఆధికారులు ఆదేశాలు జారీచేశారు. కానీ, 'సిప్రోఫ్లోక్సాసిన్ హైడ్రోక్లోరైడ్', 'గటిఫ్లోక్సాసిన్ హైడ్రోక్లోరైడ్'ను తయారుచేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.